సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం ၊ 12 ၊ జూన్ ၊ 2025



చీనీ టన్ను రూ.31,670
అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,670, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో లభిస్తుందని మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చేతన్ అన్నారు. బుధవారం ధర్మవరంలో వారు యోగాసనాలు వేశారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.1°/22.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

విద్యార్థికి సమస్యల స్వాగతం

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- ఇప్పటికీ పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- అసంపూర్తిగా తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణాలు
- పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరని 'విద్యామిత్ర కిట్లు'
- యూనిఫాం, బూట్లు, సాక్సులు, పెండింగ్
- ప్రైవేటు ఫీజుల మోతతో అల్లాడిపోతున్న తల్లిదండ్రులు
- కూటమి సర్కార్ తీరుపై సర్వత్రా విమర్శలు



పుట్టపర్తి/హిందూపురం టౌన్: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎంతో ఉత్సాహంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరం తొలిరోజే సమస్యలు స్వాగతం పలకనున్నాయి. 'విద్యామిత్ర' కిట్లు నేటికీ పాఠశాలలు చేరకపోవడం..ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి ఇలా ఉండగా... ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల మోత మోగుతోంది.

లక్ష మందికిపైగా విద్యార్థులు..


జిల్లాలోని వివిధ యాజమాన్యాల కింద 2012 పాఠశాలలుండగా.. 1 నుంచి 10వ తరగతి వరకూ 1,01,907 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ అందించేందుకు పాఠశాలల పునఃప్రారంభం నాటికే స్టూడెంట్ కిట్స్ (విద్యామిత్ర కిట్లు) స్కూల్ పాయింట్‌కు చేరుస్తామని కూటమి సర్కార్ ఆర్భాటంగా ప్రకటించినా..ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. నేటికీ జిల్లాలోని చాలా స్కూళ్లకు యూనిఫాం, బ్యాగులు, షూ చేరలేదు. దీంతో తొలిరోజు కిట్లు కాకుండా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డిక్షనరీలు మాత్రమే విద్యార్థులకు సరఫరా చేయాలని విద్యాశాఖ అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలోని కొన్ని పాఠశాలలకు పుస్తకాలు కూడా పంపిణీ చేయని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్ జగన్ హయాంలో వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు, జగనన్న కిట్లు..తదితర విద్యాసామగ్రి పాఠశాలలకు చేరేవని చెబుతున్నారు.

పూర్తికాని టీచర్ల బదిలీల ప్రక్రియ..

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తిచేసి పునఃప్రారంభం నాటికి కొత్త స్కూళ్లల్లో చేరేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించినా.. పూర్తి కాలేదు. హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలయినా ఎస్జీటీల ప్రక్రియ కొనసాగుతోంది. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు కొత్త స్కూళ్లకు వెళ్లాలి. అయితే వారి పాత స్థానంలోకి ఎవరూ రాకపోతే అలాంటి వారు వెనక్కురావాలి. ఈ స్థానంలోకి మరొకరు వచ్చేదాకా అక్కడే కొనసాగాలి.

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల మోత..

జిల్లాలో 650 వరకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల నిర్వాహకులు టెక్నో, ఈ–టెక్నో, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్... ఇలా వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో తరగతిని బట్టి రూ.20 వేల నుంచి రూ.80 వేల దాకా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇతర ఖర్చులు కలుపుకుంటే ఒక్కో విద్యార్థిపై అక్షరాల లక్షపైనే వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. తమ పాఠశాలలో చెప్పే సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు బయట ఎక్కడా దొరకవని, వీటితో పాటు నోటు పుస్తకాలు సైతం పాఠశాలలోనే కొనుగోలు చేయాలనే నిబంధన విధించారు. దీంతో చేసేది లేక తల్లిదండ్రులు అక్కడే పుస్తకాలు కొంటున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫీజుల నియంత్రణ ఉండేది. ఇక డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు వసూలు చేసేందుకు అవకాశం ఉండేది కాదు. కానీ ప్రస్తుతం ఇవేవీ అమలు కావడం లేదు. దీనిపై విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



జగరాజుపల్లి మోడల్ స్కూల్ భవనం దుస్థితి

పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలోని మోడల్ స్కూల్ ఇది. 300 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. కనీస సౌకర్యాలు కరువు కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి సెలవుల్లోనే వివిధ పనులు చేపట్టాల్సి ఉన్నా.. కూటమి సర్కార్ దృష్టి సారించలేదు. ఫలితంగా విద్యార్థులు మరో సంవత్సరం సమస్యలతో సహవాసం చేస్తూ చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



మోడల్ స్కూల్ ఆవరణలో నిలిచిన మురుగునీరు

సౌకర్యాలు కరువు..

వేసవి సెలవులు ప్రారంభం కాగానే పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి సౌకర్యాలన్నీ కల్పిస్తారు. గత ఐదేళ్లు ఇదే పద్ధతిలోనే పనులు సాగాయి. కానీ ప్రస్తుత కూటమి సర్కార్ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులను పూర్తిగా విస్మరించింది. కనీసం గత ప్రభుత్వ హయాంలో 'నాడు–నేడు' కింద చేపట్టిన భవనాలు, టాయిలెట్స్, ఇతరత్రా నిర్మాణాలు సైతం పూర్తి చేయలేని పరిస్థితుల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే గత ఏడాదిలోనే 4 వేల మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు బాట పట్టారు. ఇక ఈ సంవత్సరం ఎంత మంది ప్రభుత్వ స్కూళ్లను వీడుతారో త్వరలోనే తెలియనుంది.

వసతులు కల్పించాలి



ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో వసతులు లేవు. ఇలా అయితే మాలాంటి వాళ్లు పిల్లల్ని ఎక్కడ చదివించాలి. నా కుమారుడిని ప్రైవేట్ స్కూల్లో చదివించలేక ప్రభుత్వ బడిలో 4వ తరగతిలో చేర్పాను. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా పాఠశాలలపై దృష్టి సారించి అన్ని పాఠశాలల్లో వసతులు మెరుగుపరిస్తే బాగుంటుంది.

– శ్రీ చందన, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

ప్రైవేటు దోపిడీ పెరిగింది



కూటమి ప్రభుత్వంలో ఫీజులపై నియంత్రణ లేదు. అందుకే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల నిర్వాహకులు ఇష్టానుసారం పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కూడా లేని స్కూళ్లలోనే ఎల్కేజీకే రూ.30 వేలు పిండుకుంటున్నారు. పాఠశాలల ఆవరణలోనే పుస్తకాలు, విద్యా సామగ్రి విక్రయిస్తున్నారు. అయినా విద్యాశాఖాధికారులకు పట్టడం లేదు.

– బాబావలి, జిల్లా అధ్యక్షుడు, పీడీఎస్‌యూ

న్యూస్‌రీల్

టీచర్ల సహనానికి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ఉన్నతాధికారులు మళ్లీ టీచర్ల సహనానికి పరీక్ష పెట్టారు. పంగల్‌రోడ్డులోని ఆర్టీటీ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ తొలిరోజు మంగళ వారం రసాభాస నడుమ రాత్రి 10.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ సాంకేతిక సమస్యలతో అర్ధరాత్రి తర్వాత వాయిదా పడింది.

ఉదయం 11 గంటలకు అని చెప్పి...

బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని,జాబితాలోని 1 నుంచి 500 సంఖ్య వరకు హాజరుకావాలంటూ ఉదయాన్నే ఉపాధ్యాయులకు మెసేజ్‌లు పంపారు. కానీ సాయంత్రం 4 గంటలకు 1 నుంచి 350 సంఖ్య వరకు రావాలంటూ మెసేజ్‌లు పెట్టారు. ఎట్టకేలకు 4.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా సీనియార్టీ జాబితాలో అవకతవకలు, స్టేషన్ పాయింట్ల నమోదులో అక్రమాలు, ప్రిఫరెన్షియల్ కేటగిరీలో అర్హులు తదితర సమస్యలపై విన్నవించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ స్పష్టం చేశారు.

వెబ్ ఆప్షన్ల బహిష్కరణ..

భాషా పండితుల (ఎల్‌పీ) బదిలీల్లో భాగంగా బుధవారం రాత్రి ఫైనల్ సీనియార్టీ జాబితా విడుదల చేశారు. అయితే, ఫిర్యాదులు స్వీకరించకుండానే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశాలు జారీ చేయడంపై భాషా పండితులు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

నేడు కౌన్సెలింగ్ ఇలా...

క్రమ సంఖ్య 351 నుంచి 700 వరకు ఉన్న ఎస్జీటీలకు గురువారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, క్రమ సంఖ్య 701 నుంచి 1,000 వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని అనంతపురం డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు

గుంతలో పడి టీచర్‌కు గాయాలు

బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ పి. రామిరెడ్డి, బుక్కపట్నంలో ఎస్జీటీగా పని చేస్తున్న సుధారాణి దంపతులు. భార్య కౌన్సెలింగ్ నేపథ్యంలో రామిరెడ్డి బుధవారం పంగల్‌రోడ్డులోని ఆర్టీటీ స్కూల్‌కు వచ్చారు. రాత్రి భోజనం కోసమని కేంద్రం నుంచి బయటకు వెళ్తూ చీకట్లో ప్రమాదవశాత్తు గుంతలో పడ్డారు. చేతికి తీవ్ర గాయాలు కాగా, తోటి టీచర్లు ఆయన్ను నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

నేడు పేరూరుకు వైఎస్సార్ సీపీ నాయకులు

- అత్యాచారానికి గురైన దళిత బాలిక కుటుంబానికి పరామర్శ

రామగిరి: కీచకుల దుర్మార్గానికి బలైపోయిన దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మండలంలోని పేరూరుకు వస్తున్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ జిల్లా కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తండ్రి చనిపోగా.. మతిస్థిమితం సరిగాలేని తల్లి పంచన ఉంటున్న అమాయక దళిత బాలికపై 14 మంది దుర్మార్గులు నెలల తరబడి అత్యాచారం చేయగా బాలిక గర్భం దాల్చిన సంగతి తెలిసిందే. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో జరిగిన ఈ అకృత్యాన్ని 'సాక్షి' వెలుగులోకి తేగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బాలిక కుటుంబానికి ధైర్యం చెప్పి పరామర్శించేందుకు మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఉషశ్రీ చరణ్, సాకే శైలజానాథ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గురువారం పేరూరు విచ్చేస్తున్నారు. తొలుత పేరూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం బాలిక కుటుంబాన్ని పరామర్శించనున్నట్లు పార్టీ కార్యాలయం వెల్లడించింది.

'రెవెన్యూ' బదిలీలు పూర్తి

నూతన స్థానాలు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వుల జారీ

పుట్టపర్తి అర్బన్: రెవెన్యూ శాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వ నిబంధనల మేరకు పలువురు ఉద్యోగులకు స్థాన చలనం కల్పిస్తూ కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ల బదిలీలు ఇలా..

ధర్మవరం తహసీల్దార్ జి.నాగరాజును చిలమత్తూరుకు, తనకల్లు తహసీల్దార్ జి.శోభా సువర్ణమ్మను రొళ్లకు, బుక్కపట్నం తహసీల్దారు సయ్యద్ షాబుద్దీన్ తనకల్లుకు, పెనుకొండ తహసీల్దార్ శ్రీధర్ గుడిబండకు, రామగిరి తహసీల్దార్ జమానుల్లాఖాన్‌ను కదిరి ఆర్డీఓ కార్యాలయానికి, నల్లచెరువు తహసీల్దార్ రవికుమార్‌ను అమరాపురానికికు బదిలీ చేశారు. అలాగే అమడగూరు తహసీల్దార్ రామనాథరెడ్డిని కలెక్టరేట్ సెక్షన్ సూపరింటిండెంట్‌గా బదిలీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్లు(రీసర్వే): కనగానపల్లి డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) నాగార్జునరెడ్డిని బుక్కపట్నం డీటీగా, బుక్కపట్నం డీటీ టీటీవీఎస్ ప్రసాద్‌ను తాడిమర్రి డీటీగా, తాడిమర్రి డీటీ సునీతను రామగిరి డీటీగా, రామగిరి డీటీ నరేష్‌ను అగళి డీటీగా, లేపాక్షి డీటీ జ్యోతిని కనగానపల్లి డీటీగా, కదిరి డీటీ రవితేజను చిలమత్తూరు డీటీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా రీసర్వేలో పని చేస్తున్నారు.

రెగ్యులర్ డీటీల బదిలీలు ఇలా..

డీఎస్‌ఓ కార్యాలయంలో సీఎస్‌డీటీగా పని చేస్తున్న హనుమంతుడును పరిగి డీటీగా, తనకల్లు డీటీ క్రాంతికుమార్‌ను డీఎస్‌ఓ కార్యాలయం సీఎస్‌డీటీగా, కదిరి ఆర్డీ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న ఉదయ్‌కుమార్‌ను తనకల్లు డీటీగా, డీఎస్‌ఓ కార్యాలయంలో సీఎస్‌డీటీగా పని చేస్తున్న వెంకటరెడ్డిని కదిరి ఆర్డీఓ కార్యాలయం డీటీగా, కదిరి ఆర్డీఓ కార్యాలయంలో డీటీగా ఉన్న గురుప్రసాద్‌ను డీఎస్‌ఓ కార్యాలయం సీఎస్‌డీటీగా, డీఎస్‌ఓ కార్యాలయంలో సీఎస్‌డీటీగా పని చేస్తున్న రవిని రామగిరి డీటీగా, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డిని నల్లమాడ డీటీగా, నల్లమాడ డీటీ సునీతను పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం డీటీగా బదిలీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్లు..

పరిగి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్(ఎస్‌ఏ) గురుప్రసాద్‌ను చిలమత్తూరుకు, చిలమత్తూరు ఎస్‌ఏ నీలకంఠప్పను చిలమత్తూరు ఎంఆర్‌ఐగా, హిందూపురం ఎస్‌ఏ శ్రీనివాసులును పరిగికి, పెనుకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల విభాగం ఎస్‌ఏ షాషావలిని అదే కార్యాలయంలో ఎస్‌ఏగా, పెనుకొండ ఎంఆర్‌ఐ ఉన్న భాస్కర్‌రెడ్డిని ముదిగుబ్బ ఎస్‌ఏగా, గుడిబండ ఎంఆర్‌ఐగా ఉన్న మహమ్మద్ బిలాల్‌ను బుక్కపట్నం ఎస్‌ఏగా, గుడిబండ ఎస్‌ఏ సావిత్రమ్మను గుడిబండ ఎంఆర్‌ఐగా, నల్లమాడ ఎంఆర్‌ఐగా ఉన్న వినోద్‌కుమార్‌ను పుట్టపర్తి కలెక్టరేట్ ఎస్‌ఏగా, పుట్టపర్తి ఎస్‌ఏ గణేష్‌కుమార్‌ను పుట్టపర్తి ఎంఆర్‌ఐగా, గాండ్లపెంట ఎంఆర్‌ఐగా ఉన్న అశోకచక్రవర్తిని తనకల్లు ఎంఆర్‌ఐగా, తనకల్లు ఎస్‌ఏ నాగేశ్వరరావును గాండ్లపెంట ఎంఆర్‌ఐగా, గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో ఎస్‌ఏగా పని చేస్తున్న షేక్షావలిని ఎన్పీకుంట ఎస్‌ఏగా బదిలీ చేశారు.

జూనియర్ అసిస్టెంట్(జేఏ)..

ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ (జేఏ) వరప్రసాద్‌ను తాడిమర్రికి, తాడిమర్రిలో ఉన్న దినేష్‌బాబును ధర్మవరం ఆర్డీఓ కార్యాలయానికి, ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న దీపను ముదిగుబ్బకు, ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలోనే ఉన్న కాత్యాయణిని రామగిరికి, ముదిగుబ్బలో ఉన్న సాయిగీతను ధర్మవరం ఆర్డీఓ కార్యాలయానికి, లేపాక్షిలో ఉన్న మహమ్మద్‌గౌస్‌ను పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హత్యలు.. అత్యాచారాలు.. కబ్జాలు

కూటమి పాలనకు ఏడాది

- దారుణాలకు కేంద్రబిందువుగా ఉమ్మడి అనంతపురం జిల్లా
- దేశవ్యాప్తంగా కలకలం రేపిన బాలికపై సామూహిక అత్యాచార ఘటన
- భయభ్రాంతులకు గురి చేసిన గిరిజన యువతి దారుణ హత్య



టీడీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన రాప్తాడుకు చెందిన దంపతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భూకబ్జాలు, అక్రమణలు, హత్యలు, అత్యాచారాలకు కూటమి సర్కారు కేరాఫ్‌గా మారింది. 'కూటమి' పాలనా పగ్గాలు చేపట్టి గురువారానికి ఏడాది పూర్తయిన నేపథ్యంలో.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఇదే చర్చ సాగుతోంది. ఏడాదిలోనే చంద్రబాబు సర్కారు భారీ వైఫల్యాలను మూటగట్టుకుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్న భావన అందరిలోనూ నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో స్కూళ్లు, కళాశాలలకు తమ పిల్లలను పంపాలంటేనే బాలికల తల్లిదండ్రులు భయపడుతున్నారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో పోలీసులు నిశ్చేష్టులై చూస్తుండడంతో సామాన్యులకు న్యాయం అందని ద్రాక్షగా మారింది.

చెరపట్టిన మైనింగ్ మాఫియా

హిందూపురం మొదలు తాడిపత్రి వరకూ అన్ని నదులనూ, వంకలనూ టీడీపీ నేతలు చెరపట్టారు. చిత్రావతి, హగరి నదులు ఇప్పటికే రూపు మారిపోయాయి. ఇక కొండలు, గుట్టలు ఏడాదిలోనే మాయమయ్యాయి. మైనింగ్, రెవెన్యూ శాఖలు ఈ విషయంలో జోక్యం చేసుకోవడం ఎప్పుడో మానేశాయి.

సూపర్ సిక్స్ మోసం..

'ఆరు పథకాలు మీ జీవితాలనే మారుస్తాయంటూ' ఎన్నికల ముందు ప్రచారం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలారు. 'అమ్మ ఒడి' లేదు, 'ఉచిత గ్యాస్ సిలిండర్లు' లేవు, రైతు సాయం లేదు, నిరుద్యోగ భృతి లేదు, ఇంటికో ఉద్యోగం లేదు. ఒక్కటంటే ఒక్క పథకమూ లేదు.

పేట్రేగుతున్న రౌడీషీటర్లు

అధికార అండతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారు. సామాన్యుల ఇళ్ల స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే కంచె వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కలుగుల్లో దాక్కున్న రౌడీషీటర్లందరూ చంద్రబాబు సర్కారు పుణ్యమా అని నేడు దర్జాగా తిరుగుతూ రెచ్చిపోతున్నారు.

ఏడాదిలో నాలుగు హత్యలు

ఒక్క ఏడాదిలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు హత్యలు జరిగాయి. వీటన్నింటి వెనుకా టీడీపీ వర్గీయులే ఉండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే హిందూపురంలో మల్లికార్జున దారుణ హత్యకు గురయ్యారు. పాపిరెడ్డిపల్లెలో లింగమయ్యపై టీడీపీ నాయకులు దాడి చేసి చంపేశారు. రాప్తాడు మండలంలో దంపతులు ముత్యాలమ్మ, నారాయణరెడ్డిని పట్టపగలే నరికి హత్య చేశారు.

మహిళల్లో ఆందోళన..

రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికను 14 మంది సామూహిక అత్యాచారం చేసిన ఘటన రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా కలకలం రేపింది. అంతేకాదు ఇంటర్ విద్యార్థిని తన్మయిని అతి కిరాతకంగా చంపి పొలాల్లో పడేసిన ఘటన జిల్లా ప్రజలను నివ్వెరపోయేలా చేసింది. తాడిపత్రిలో ఐచర్ వాహనంలో ఓ బాలిక, పుట్లూరు మండలంలో మరో బాలిక అత్యాచారానికి గురయ్యారు.

మద్యం ఏరులు..

గతంలో ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు జరిగేవి. అప్పట్లో బహిరంగ మద్యంపై ఉక్కుపాదం మోపారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నడిచే మద్యం షాపులకు వేళాపాళా లేకుండా పోయింది. బెల్టుషాపులు, పర్మిట్‌రూములతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉంటుండటంతో పల్లెలు మత్తులో జోగుతున్నాయి.

కరెంటు బిల్లులతో లబోదిబో..

అధికారంలోకి వస్తే ఒక్కపైసా కరెంటు చార్జీ పెంచబోనని చెప్పిన చంద్రబాబు.. కరెంటు చార్జీలు పెంచి సామాన్యుల నడ్డివిరిచారు. రూ.800 బిల్లు వచ్చే మధ్యతరగతి కుటుంబానికి ఇప్పుడు రూ.1,500 వస్తోంది. కరెంటు చార్జీల పెంపుతో జనం అల్లాడిపోతున్నారు.

గాలీవాన బీభత్సం.. వృద్ధుడి మృతి

- రామగిరి మండలం పేరూరు కురుగుండ్లకాలనీలో ఘటన
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



పేరూరు కురుగుండ్లకాలనీలో నేలకొరిగిన చెట్లు



రామగిరి: పేరూరు పంచాయతీ కురుగుండ్లకాలనీలో మంగళవారం రాత్రి గాలీవాన బీభత్సం చేసింది. వర్షంతోపాటు బలమైనగాలులు వీయడంతో గొర్రెలమంద వద్ద మంచంపై నిద్రిస్తున్న అశ్వర్థప్ప (70) సుమారు 10 అడుగుల దూరం ఎగిరి పడి మృతి చెందాడు. రెండు ఇళ్లు నేలమట్టంకాగా, పలు ఇళ్లపైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. గాలివేగం అంతకంతకూ పెరగడంతో 35కుపైగా విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. పదుల సంఖ్యలో భారీ చెట్లు కూలిపోయాయి. మృతుడు అశ్వర్థప్ప స్వగ్రామం పరిగి మండలం చిన్నంపల్లి కాగా, విషయం తెలుసుకున్న కుటుంబీకులు రాత్రే మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

19 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 19 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా లేపాక్షి మండలంలో 38.4 మి.మీ, చిలమత్తూరు 32.8, గోరంట్ల మండలంలో 32.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఇక హిందూపురం మండలంలో 26.4 మి.మీ, పరిగి 22.6, రొద్దం మండలంలో 21.6 వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మిగతా మండలాల్లోనూ 11 నుంచి 1.2 మి.మీ మధ్య వర్షపాతం నమోదైందనట్లు వెల్లడించారు. మరో రెండు రోజులు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నాణ్యత నాస్తి..ధర జాస్తి

- రాయితీ విత్తన వేరుశనగకు స్పందన కరువు
- నాసిరకం విత్తనం తీసుకునేందుకు ముందుకు రాని రైతులు

పుట్టపర్తి అర్బన్/ సాక్షి నెట్‌వర్క్: కూటమి సర్కార్ 40 శాతం రాయితీ అంటూ అట్టహాసంగా పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగ తీసుకునేందుకు రైతులు ఉత్సాహం చూపడం లేదు. నైరుతి ముందస్తుగానే పలకరించగా ఇప్పటికే పలువురు రైతులు మార్కెట్‌లో విత్తనం కొన్నారు. మరికొందరు రైతులు రాయితీపై వచ్చే విత్తనం కోసం ఇప్పటి వరకూ వేచి చూసినా ప్రభుత్వం నాసిరకం విత్తనం పంపిణీ చేయడంతో తీసుకోకుండానే వెనుదిరిగారు.

రెండు రోజుల్లో 1,389 క్వింటాళ్లే పంపిణీ..

జిల్లాకు ప్రభుత్వం 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించగా, ఇప్పటి వరకూ 29 వేల క్వింటాళ్ల విత్తనం మాత్రమే వచ్చింది. దీంతో రైతుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అయితే విత్తన పంపిణీ మంగళవారం ప్రారంభించగా.. బుధవారం నాటికి కేవలం 1,389 క్వింటాళ్ల విత్తనం మాత్రమే రైతులు తీసుకున్నారు. చాలా మంది ఆర్‌ఎస్‌కేల వద్దకు వచ్చి విత్తనం నాణ్యత చూసి తీసుకోకుండానే వెళ్లిపోతున్నారు.

నాణ్యత సరిగా లేక...

చాలా ప్రాంతాల్లో విత్తనం నాణ్యత నాసిరకంగా ఉంది. చెత్తచెదారం, బుడ్డలు ఎక్కువగా ఉండటంతో ఎవరూ ఉత్సాహం చూపడం లేదు. పైగా 40 శాతం రాయితీతో ప్రభుత్వం ఇస్తున్న ధరకే మార్కెట్‌లో నాణ్యమైన విత్తనం దొరుకుతుండటంతో రైతులంతా ప్రైవేటుగానే విత్తనం కొనుగోలు చేస్తున్నారు.

- ధర్మవరం మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో బుధవారం సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. విత్తనం నాణ్యత సరిగా లేకపోవడంతో కొనుగోలుకు రైతులు పెద్దగా ఉత్సాహం చూపలేదు.
- అమరాపురం మండలంలో పంపిణీ చేసిన విత్తన వేరుశనగ బస్తాల్లో బుడ్లు, చిరు విత్తనాలు అధికంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మూడు బస్తాల విత్తనకాయను మిషన్‌లో ఆడించగా 6 కేజీల వరకు బుడ్లు, చిరు విత్తనాలు 4 కేజీలు వచ్చినట్లు రైతు శశికుమార్ తెలిపారు.
- రొళ్లలో పంపిణీ చేసిన సబ్సిడీ విత్తన కాయలు నాసిరకం ఉన్నట్లు రైతులు గుర్తించారు. విత్తనం మరీ చిన్నగా ఉందని, దాన్ని విత్తితే మొలకెత్తదని రైతులు చెబుతున్నారు. రాయితీ పోను రైతు వాటాగా చెల్లించాల్సిన మొత్తం వెచ్చిస్తే మార్కెట్‌లో నాణ్యమైన విత్తన వేరుశనగ తీసుకోవచ్చంటున్నారు.
- పరిగి మండలంలో బుధవారం పంపిణీ చేసిన విత్తన బస్తాల్లో జల్లు బుడ్డలు ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో పాటూ బస్తాకు రూ.1,700 వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు.



అమరాపురం మండలం నగోనపల్లిలో పంపిణీ చేసిన నాసిరకం విత్తనకాయలు

రెవెన్యూలో బదిలీలలు

- ధర్మవరం తహసీల్దార్‌ను బదిలీ చేసి డీటీకి పూర్తి స్థాయి బాధ్యతలు
- గతంలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డీటీకి ఎఫ్‌ఏసీ ఇవ్వడంపై అనుమానాలు
- పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుని అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు



సాక్షి టాస్క్‌ఫోర్స్: తహసీల్దార్ల బదిలీలు ధర్మవరం నియోజకవర్గ ప్రజలను విస్తుగొలుపుతున్నాయి. జిల్లాలో ఎక్కడైనా తహసీల్దార్‌ను బదిలీ చేసేటప్పుడు ఆ స్థానంలో ప్రతిభ ఉన్న తహసీల్దార్‌ను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ధర్మవరం నియోజకవర్గంలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతిభ ఆధారంగా కాకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కింది స్థాయి అధికారికి తహసీల్దార్‌గా ఎఫ్‌ఏసీ బాధ్యతలు కట్టబెట్టడంపై అన్ని వర్గాల ప్రజలు విస్తుపోతున్నారు.

అక్రమాలే ఆయన ప్రవృత్తి..

ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం జిల్లాలోనే ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. అంతే కాక రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నది కూడా ఇక్కడ నుంచే కావడం విశేషం. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన తహసీల్దార్ బదిలీల ఉత్తర్వుల్లో ధర్మవరం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న నటరాజ్‌ను చిలమత్తూరుకు బదిలీ చేశారు. అయితే ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌కు ఎఫ్‌ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్) బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సురేష్‌పై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పని చేసిన ఆయన అన్ని తానై ఉండి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. డి.చెర్లోపల్లి పొలంలో దాదాపు 60 వరకు నకిలీ డీపట్టాలు మంజూరు చేశారు. అలాగే అర్హుల పేర్లు తొలగించి అనర్హులకు పట్టాలు కట్టబెట్టారు. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు అప్పట్లో విచారణ చేపట్టి వాస్తవమని నిర్ధారించారు. అంతేకాక ఏడాది క్రితం కలెక్టరేట్‌లో పని చేసిన సమయంలోనూ అన్నీ తానై నడిపి చుక్కల భూములు, ఫ్రీహోల్డ్, అసైన్‌మెంట్ కమిటీల విషయంలో ఏకంగా తహసీల్దార్లతోనే ముడుపులు దండుకున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలే ప్రవృత్తిగా ఉన్న అలాంటి అధికారికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ పోస్టింగ్ వెనుక కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పలువురికి భారీగా ముడుపులు ముట్టజెప్పినట్లుగా ఆ శాఖలోని ఉద్యోగులే అంటున్నారు. ఈ తతంగం వెనుక ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలోని ఓ అధికారి చక్రం తిప్పినట్లుగా సమాచారం.

క్లుప్తంగా

ప్రమాదంలో చిన్నారి మృతి



మృతి చెందిన తన్మయి

బత్తలపల్లి: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై తల్లిదండ్రులతో కలసి వెళుతున్న చిన్నారి మృతి చెందింది. వివరాలు.. బత్తలపల్లి మండలం అప్పరాచెరువు గ్రామానికి చెందిన చాకలి నరసింహులు, మణికంఠేశ్వరి దంపతులు బుధవారం ఏడాది వయసున్న తమ చిన్నారి తన్మయితో కలిసి ద్విచక్ర వాహనంలో ధర్మవరం వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ధర్మవరం మండలం సుబ్బారావుపేట గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తలిదండ్రులతో పాటు చిన్నారికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే క్షతగాత్రులను ఆర్డీటీ ఆస్పత్రికి తరలిస్తుండగా తన్మయి(1) మృతి చెందింది. తల్లిదండ్రులకు నడుము, కాళ్లు విరిగాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఈడిగ కాశప్ప, లింగమయ్య, ఈశ్వరయ్య, బండి నాగభూషణ, వెంకటరాముడు తదితరులు బాధితులను పరామర్శించారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

తనకల్లు: మండలంలోని ముత్యాలవారిపల్లిలో ఈ నెల 3న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన పుప్పాల గిరిష్‌బాబు, సంధ్యారాణి దంపతుల కుమారుడు నిశాంత్ (3) అక్కడికి సమీపంలోని నీటి సంప్‌లో పడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన జరిగిన రోజే బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు జరిపించారు. అయితే బాలుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన ఎస్‌ఐ గోపి... బుధవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి గ్రామానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని వెలికి తీయించి అక్కడే పోస్టుమార్టం జరిపించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీచైతన్యలో పాఠ్య పుస్తకాల గది సీజ్

హిందూపురం టౌన్: నిబంధనలకు విరుద్ధంగా హిందూపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను విద్యాశాఖ అధికారి బుధవారం సీజ్ చేశారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పేరుతో రూ.వేలల్లో అక్రమ వసూళ్లకు పాఠశాల యాజమాన్యం పాల్పడుతోందని గుర్తించిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బుధవారం ఆ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న సీఆర్‌పీ మంజునాథ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య యాజమాన్యం ప్రైవేటుగా ఓ గదిని తీసుకుని శ్రీచైతన్య పేరుపై ముద్రించిన పుస్తకాలు, యూనిఫాంను విక్రయిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ప్రభాకర్, మహేష్, శివ, శబరీష్, శ్రీనివాస్, లిఖిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్వోగా వేణుగోపాలరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా సమాచార పౌర సంబంధాల జిల్లా అధికారి (డీపీఆర్వో)గా వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న వేణుగోపాలరెడ్డిని నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ హిమాంశ్‌శుక్లా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేసిన వేలాయుధాన్ని తిరుపతి సహాయసంచాలకులుగా, ఏపీఆర్‌ఓ ఫకృద్దీన్‌ను అనంతపురానికి బదిలీ చేశారు.

వితంతు పింఛన్ల పంపిణీకి కుదరని ముహూర్తం

పుట్టపర్తి అర్బన్: వితంతు పింఛన్ల పంపిణీపై ప్రభుత్వం శీతకన్నేసింది. రెండు నెలలుగా ఊరిస్తూ వచ్చిన పంపిణీ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. తొలుత మే 1వ తేదీన పంపిణీ చేస్తామని చెప్పారు. అయితే జాబితాలో పేర్లు కనబడకపోవడంతో అర్హులకు భంగపాటు తప్పలేదు. నెలంతా ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. ఈ నెలలో ఇప్పటికే 11 రోజులు గడిచిపోయినా సచివాలయాలకు ఇప్పటికీ జాబితా అందలేదు. ఈ నెల 12న వితంతు పింఛన్లు గ్యారంటీగా ఇస్తామన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సైతం పత్రికా ప్రకటన ఇచ్చారు. దీంతో పింఛన్ల సొమ్ము తీసుకునేందుకు బుధవారం బ్యాంకుల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి సాయంత్రం వరకూ ఎదురు చూశారు. అయినా వారి ఖాతాల్లోకి డబ్బు జమకాకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఈ విషయం తెలుసుకున్న వితంతువులు ఈ నెల కూడా తమకు పింఛన్ అందదనే నిర్ధారణకు వచ్చేశారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ నరసయ్యను వివరణ కోరగా.. జిల్లాలో 3,030 మందికి వితంతువు పింఛన్ మంజూరైనట్లు తెలిపారు. ఇది కూడా ఇప్పటి వరకూ పింఛన్ తీసుకుంటూ మృతి చెందిన భర్త స్థానంలో భార్యకు మాత్రమే ఇస్తున్నట్లుగా వివరించారు. అయితే పంపిణీ తేదీ వాయిదాపడిందని, ఎప్పుడు ఇచ్చేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

హిందూపురం: ఆత్మహత్యకు సిద్ధమైన వ్యక్తిని సకాలంలో పోలీసులు గుర్తించి కాపాడారు. వివరాలు.. హిందూపురంలోని విద్యానగర్‌కు చెందిన త్యాగరాజు స్థానిక కర్ణాటక బ్యాంక్‌లో గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తున్నాడు. 3 నెలల క్రితం రూ.15 లక్షల వరకూ అప్పులు చేసి మామిడి తోటలు కొనుగోలు చేశాడు. తోటల నిర్వాహణలో నష్టం రావడంతో అప్పులు చెల్లించకపోతే పరువు పోతుందని ఆందోళనకు లోనైన ఆయన తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా బుధవారం సెల్ఫీ వీడియో తీసి తన అన్నకు పంపాడు. చూసిన త్యాగరాజు అన్న వెంటనే హిందూపురం డీఎస్పీ మహేష్‌కు షేర్ చేయడంతో స్పందించిన డీఎస్పీ ఆదేశాల మేరకు టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం, వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీధర్... త్యాగరాజు ఉన్న ప్రాంతాన్ని ఆయన సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్ అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

తాగుడు మానేయమంటే ఉరేసుకున్నాడు

గుంతకల్లు: పాత గుంతకల్లు ప్రాంతానికి చెందిన వడ్డే రంగముని, సుజాత దంపతుల కుమారుడు వడ్డే రాజేష్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. డెకరేషన్ పనులతో కుటుంబానికి చేదోడుగా నిలిచిన రాజేష్... ఏడాదిగా మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా తన ప్రవర్తనను మార్చుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాజేష్‌ను తల్లిదండ్రులు మందలించారు. దీంతో అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వారి సాయంతో రాజేష్‌ను ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం



సీఆర్ జ్ఞానేశ్వర్



అభిషేక్ రెడ్డి

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ సీనియర్ వన్డే క్రికెట్ అంతర్ జిల్లా టోర్నీలో భాగంగా రెండో రౌండ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లా జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 389 పరుగులు సాధించింది. జట్టులో సీఆర్ జ్ఞానేశ్వర్ 118 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 108 పరుగులు, బి.అభిషేక్‌రెడ్డి 128 బంతుల్లో 16 ఫోర్లతో 116 పరుగులు, ఏవీ సూర్య 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 63 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైఎస్సార్ కడప జట్టు 14.5 ఓవర్లలో 94 పరుగులు చేసి ఒక వికెట్ నష్టపోయింది. వర్షం రావడంతో మ్యాచ్‌ను రద్దు చేసి రెండు జట్లకు సమాన పాయింట్లు కేటాయించారు. కాగా, రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో చిత్తూరు జట్టు గణనీయమైన పాయింట్లు దక్కించుకోవడంతో అగ్రస్థానానికి ఎగబాకింది.

- కర్నూలు - నెల్లూరు జిల్లా జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 49.4 ఓవర్లలో 212 పరుగులు చేసి ఆలౌట్ అయింది. నయీముల్లా 86 బంతుల్లో 58 పరుగులు, ఎస్కే కమరుద్దీన్ 26 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 25.1 ఓవర్లలో 163 పరుగులు చేసి ఆరు వికెట్లు నష్టపోయింది. కె.నిఖిలేశ్వర రెడ్డి 38 పరుగులు, శోభన వర్మ 19 పరుగులు, రోషన్ పవన్ 40 పరుగులు సాధించారు. వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ విధానం ప్రకారం నెల్లూరు జట్టు గెలుపొందినట్లు ప్రకటించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చేతన్, తదితరులు

ధర్మవరం: రోజు యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యోగా దినోత్సవ వేడుకలను కలెక్టర్‌తో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఔత్సాహికులతో కలసి మంత్రి యోగాసనాలు వేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, యోగాను జీవితంలో భాగం చేసుకుంటే ఎలాంటి ఒత్తిడి దరిచేరదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రమంతటా యోగా దినోత్సవాలను నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులను చేస్తున్నామన్నారు. అంతకుముందు విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్లు

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌తో పాటు పరివాహక ప్రాంతంలోని కోనంపల్లి గ్రామంలో పంటలు, నీటి వినియోగాన్ని ట్రైనీ కలెక్టర్లు పరిశీలించారు. ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ట్రైనీ కలెక్టర్లు సచిన్‌రహర్, నరేంద్ర పాడల్, పృథ్వీరాజ్‌కుమార్, సందీప్ రఘువంశీ, నాగ వెంకటసహిత్, పర్విన్ జాహిద్, మనీషా బుధవారం జీడిపల్లి పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ అనిల్‌కుమార్ స్వాగతించారు. కోనంపల్లి వద్ద బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు నీటి వినియోగంపై డ్రిప్, స్ప్రింక్లర్ల పనితీరును ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు. జీడిపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన అంశాలను హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ రాజాస్వరూప్, ఈఈ శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ, ఎంఐఓ మల్లేష్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- రూ.4 లక్షల నగదు స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కదిరి అర్బన్: సైబర్ నేరాలకు పాల్పడిన ముఠా సభ్యులను కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ నిరంజనరెడ్డి వెల్లడించారు. పుట్టపర్తికి చెందిన టి.శ్రీనివాసరావు, టి.దుర్గాబాయి దంపతులు గతంలో కర్నూలులో వాటర్ ఫిల్టర్ పరికరాల వ్యాపారం చేసేవారు. అందులో నష్టాలు చవిచూశాక 2023లో పుట్టపర్తికి మకాం మార్చారు. పుట్టపర్తిలోని కోటక్ మహేంద్ర బ్యాంక్‌లో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న సాయిభార్గవి, ధర్మవరంలో సిమ్‌కార్డులు అమ్ముకుని జీవనం సాగిస్తున్న శివానందతో పరిచయం పెంచుకున్నారు. సాయి భార్గవి ద్వారా కోటక్ మహేంద్ర బ్యాంక్‌లో ఖాతాలు తెరుస్తూ శివానంద్ వద్ద నుంచి పొందిన సిమ్‌కార్డులతో ఆర్వో ప్లాంట్ల యజమానులను సంప్రదించేవారు. ప్లాంట్‌కు సంబంధించిన పరికరాలు సగం ధరకే ఇస్తామని నమ్మబలికి తమ బ్యాంక్ ఖాతాకు డబ్బులు బదలాయించుకుని ఆ తర్వాత సిమ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలను మార్చేవారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది వీరి ఖాతాలకు నగదు బదలాయించి మోసపోయారు. ఈ క్రమంలో కదిరి మండలం బోడేనాయక్‌తండాకు చెందిన బాబ్జీనాయక్ గత ఏడాది జులై 16న తాగునీటికి ఉపయోగించే రూ.15 వేల విలువైన ఏటీఎం కాయిన్ బాక్స్ కోసం రూ.8 వేలను ఫోన్‌పే చేసి మోసపోయాడు. దీనిపై బాబ్జీనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో బుధవారం కదిరి కొండ వద్ద తచ్చాడుతున్న శ్రీనివాసరావు దంపతులను గుర్తించి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లు, 13 డెబిట్ కార్డులు, 52 సిమ్‌కార్డులు, 2 చెక్‌బుక్కులు, 8 బ్యాంక్ పాసుపుస్తకాలు, 2 పాన్‌కార్డులు, 6 బిల్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.

'ప్రిఫరెన్షియల్'లో దుర్వినియోగం

- కార్యాలయ సిబ్బంది నిర్వాకంపై డీఈఓకు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులు



డీఈఓ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఈఓ కార్యాలయ సిబ్బంది నిర్వాకం కారణంగా ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ దుర్వినియోగమైందని డీఈఓ ప్రసాద్‌బాబుకు పలువురు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. బుధవారం డీఈఓను కలిసి ఆధారాలను అందజేశారు. నగరంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ ఇంగ్లిష్‌కు సంబంధించి ఆరు పోస్టులున్నాయన్నారు. కొత్త బదిలీల చట్టం ప్రకారం 50 శాతం అంటే వీటిలో మూడు పోస్టులు ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చూపించాల్సి ఉండగా... ఏకంగా ఐదు పోస్టులను ఇచ్చారన్నారు. ఈ కారణంగా సీనియారిటీ జాబితాలో మిగిలిన టీచర్లకు చాలా నష్టం వాటిల్లిందని, ఈ అంశంపై డీఈఓకు గ్రీవెన్స్ ఇచ్చినా సమస్యకు పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. పీహెచ్ (అంధులు) కేటగిరీ కింద ధర్మవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆదిమూలం శ్రీనివాసులు ప్రస్తుత బదిలీలో తప్పనిసరిగా ఉన్నారన్నారు. అయితే ఆయన పీహెచ్ కేటగిరీని వదిలి జనరల్ కేటగిరీకి దరఖాస్తు చేసుకుంటున్నట్లు తన ఇష్టపూర్వక లేఖను సమర్పించారన్నారు. ఈ లెక్కన ఆయన పేరును జనరల్ కేటగిరీలో చూపాల్సి ఉందన్నారు. అతను జనరల్ కేటగిరీలోకి వస్తే, తర్వాత ఉన్న మహిళా టీచర్‌ను బాలికల పాఠశాలకు కేటాయించకుండా పురుష టీచరును నియమించారన్నారు. చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న జిల్లా పరిషత్ యాజమాన్య టీచర్లు తిరిగి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను ఎంచుకున్నారన్నారు. వీటిపై అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఎస్‌ఏ ఇంగ్లిష్ కె.సురేష్‌బాబు జెడ్పీ నుంచి కదిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, రంగస్వామిని గుంతకల్లులోని ప్రభుత్వ పాఠశాల, గణితం టీచరు డి.అమరేంద్ర కుమార్ రెడ్డిని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారన్నారు. అలాగే ఎస్‌ఏ సోషల్ కె.మాదార్‌బీని ఉరవకొండ ప్రభుత్వ పాఠశాలకు బదిలీ చేశారన్నారు. అక్రమ బదిలీలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. తర్వాత సీనియారిటీలో ఉన్న అర్హులైన ఉపాధ్యాయులకు ఆ స్థానాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

పేరుకే మహా ప్రస్థానం



ప్రైవేట్ అంబులెన్స్‌లో మారెక్క మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నాలుగు మహాప్రస్థానం వాహనాలు ఉండగా ఇందులో ఏ ఒక్కటీ అత్యవసర సమయంలో నిరుపేదలకు ఉపయోగ పడడం లేదు. సర్వజనాస్పత్రికి చికిత్స కోసం వచ్చిన కంబదూరు మండలం పి.వెంకటాంపల్లికి చెందిన హరిజన మారెక్క(48) బుధవారం మృతి చెందింది. దీంతో వార్డు గోడలపై ఉన్న మహాప్రస్థానం వాహనం కోసం ఉదయం 9.30 గంటలకు మృతురాలి కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. అయితే మహాప్రస్థానం వాహనం అందుబాటులో లేదని, రావడానికి రాత్రి 7 గంటలవుతుందని డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ ఫోన్ కట్ చేశాడు. దీంతో మారెక్క కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులను సంప్రదించారు. బాధితుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు పెద్ద మొత్తంలో డిమాండ్ చేశారు. పలుమార్లు ప్రాధేయపడిన తర్వాత చివరకు రూ.5,500తో ఒప్పుకుని మృతదేహాన్ని తరలించేందుకు ముందుకు వచ్చారు. ఆస్పత్రిలో రోజూ 6 నుంచి 10 మంది మృత్యువాత పడుతున్నారు. ఈ మృతదేహాలను తరలించేందుకు గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ తలారి రంగయ్య తన కోటా నిధుల్లో నుంచి రూ.10 లక్షలు వెచ్చించి మహాప్రస్థానం వాహనాన్ని సమకూర్చారు. ఈ వాహనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అయితే ఆ వాహనానికి ఇంధనం సమకూర్చకపోవడంతో మూలన పడింది. ఇదే విషయమై ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. త్వరలో వాహనం రెగ్యులర్‌గా తిరిగేందుకు ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేసేలా కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ (45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు... చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లికి చెందిన ఓ మహిళ పెద్ద కర్మ కార్యక్రమంలో గురువారం నిర్వహించేందుకు కుటుంబసభ్యులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కొత్తచెరువు నుంచి సప్లయర్స్ సామగ్రిని తెప్పించుకున్నారు. అదే సప్లయర్స్‌లో కూలి పనులతో జీవనం సాగిస్తున్న సత్యనారాయణ పనిలో భాగంగా బుధవారం గంగినేపల్లికి చేరుకున్నాడు. షామియానా ఏర్పాటు చేస్తూ ఇంటికి తాడు కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కొత్తచెరువు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై సీకేపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన మహిళా ఉద్యోగి మృతి



ముకుంద ప్రియ (ఫైల్)

ఓర్వకల్లు: ప్రమాదంలో గాయపడిన గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా వెంకటాంపల్లి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి భార్య ముకుంద ప్రియ కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ సచివాలయం-2లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భర్త చంద్రారెడ్డి ఆర్మీకి వెళ్లడంతో కర్నూలులో ఉంటున్న తల్లిదండ్రుల వద్ద ముకుంద ప్రియ నివాసముంటూ రోజూ కర్నూలు నుంచి స్కూటీపై విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో గత నెల 20న విధులకు వెళ్తుండగా రోడ్డుపై నిలబడిన లారీని ఢీకొన్నారు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందారు. మృతురాలి తండ్రి రుక్మాంగదరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

51 ఏళ్ల తర్వాత కలిశారు



హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో 1972-74లో కలసి ఇంటర్మీడియట్ చదువుకున్న వారు 51ఏళ్ల తర్వాత బుధవారం ఓ తోటలో ఒక్కటయ్యారు. వీరిలో చాలా మంది ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ పదవీవిరమణ పొందారు. స్నేహితులను చూడగానే ఒకరినొకరు ఆలింగనం చేసుకుని మురిసిపోయారు. అలనాటి అల్లరి ఆటలు, పాటలు, చదువు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు దేవాంగం శంకరప్ప, సత్యనారాయణ, ఆనందరెడ్డి నేతృత్వం వహించగా శంకరప్ప, సత్యనారాయణ, ఆనంద రెడ్డి, ధనలక్ష్మి, శ్రీనివాసులు, అనంతరామ్, రమేష్, సుందరమూర్తి, మహీధర్, వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.